కథా నిలయం
శ్రీకాకుళం

# విషం కురిసిన రాత్రి

—సి. ఎస్. ఆర్. ప్రసాద్.

హసన్‌కి ఏమీ తోచడంలేదు. ఇల్లు కదలడానికి లేదు. ఇంట్లోనే జైలు శిక్ష. హౌస్ అరెస్ట్.

భార్య మార్జియానా వంటగదిలో ఏదో చేస్తోంది.

పిల్లలు ముగ్గురూ సరదాగా ఆడుకుంటున్నారు. కర్ఫ్యూ మూలంగా బడిలేనందుకు వాళ్ళకి సంతోషంగా వుంది.

"అరే భాయ్! ఈ కర్ఫ్యూ ఒక నెల వుంటే బాగుంటుందిరా, హాయిగా బడికి పోకుండా ఆడుకోవచ్చు" అంటున్నాడు రెండోవాడు.

మిగిలిన ఇద్దరు పిల్లలు పగలబడి నవ్వుతున్నారు.

"ఛీ....నోర్మూయ్యండి" అన్నాడు హసన్ కసురుతూ. పిల్లలు భయంగా తండ్రివంక చూశారు.

లోకంలో స్వార్థం ఎట్లా వెర్రితలలు వేస్తోందో వాడి మాటలవల్ల తెలుసుకోవచ్చు. కర్ఫ్యూ ఎందుకుపెట్టారో, దానికి దారితీసిన సంఘటనలతో వాడికి ప్రమేయంలేదు. ఎవరెట్లా నష్టపోయినా వాడికి పట్టదు. వాడి స్వార్థం వాడిది. కర్ఫ్యూవుంటే బడికి వెళ్ళక్కర్లేదు. ఎన్ని నెలలైనా ఫరవాలేదు. వాడిలాగే చాలామందికి కర్ఫ్యూవల్ల ఇబ్బంది లేకపోవచ్చు.

కాని రోజూ రెక్కాడితేగాని డొక్కాడని కూలీలు, రిక్షావాళ్ళ వంటి బడుగువర్గాల గతేమిటి ? చేతిలో పైసాలేని సాధారణ మానవులపాట్లు ఎవరు పట్టించుకుంటారు ?

"వెధవ కర్ఫ్యూ....వెధవ మనుషులూ ! అంతా స్వార్థంలో కొట్టు కుని పోతున్నారు" గొణుక్కున్నాడు హసన్.

"అబ్బాజాన్ ! రాత్రి బాబా ఇంటికి రాలేదా ?" ప్రశ్నించాడు పెద్ద కొడుకు.

షాక్ తగిలినట్లు అదిరిపడ్డాడు హసన్. కొడుకు అనేవరకూ ఆ విష యమే గుర్తురాలేదు అతనికి.

"రాలేదుబేటా" అన్నాడు విచారంగా.

"ఇంటికి రాకుండా ఎక్కడున్నాడు ?" మళ్ళీ ప్రశ్నించాడు.

"ఎక్కడున్నాడో ? ఒకవేళ ఇంటికివస్తూ వుండగా దుండగుల చేతుల్లో చిక్కి....."

హసన్‌గుండె జల్లుమంది, ఆ ఆలోచన రాగానే. మనసు మనసులో లేదు. హృదయమంతా ఎవరో ఇనుపచేతితో దేవినట్లయింది. అలా శిలా విగ్రహంలా వుండిపోయాడు చాలా సేపు.

పిచ్చెక్కిపోతున్నట్లయింది పిచ్చిపిచ్చి ఆలోచనలతో. మనసు మళ్ళించు కోవడానికి ఏదైనా పుస్తకం చదువుకోవాలనుకున్నాడు. బుక్‌షెల్ఫ్‌లోనుంచి మహాకవి ఇక్బాల్ పుస్తకాల్లో తనకు నచ్చినవి ఏరుకున్నాడు. వాటిని టీపాయ్ మీద పెట్టుకుని కూర్చున్నాడు.

పుస్తకం పేజీలు తిరగేస్తున్నాడు. కళ్ళు అక్షరాలవెంట పరిగెత్తు తున్నాయి. కాని విషయం బుర్రకెక్కడంలేదు.

కాలం మేకను మింగిన కొండచిలువలాగ నెమ్మదిగా నడుస్తున్నది.

ఇంతలో పక్కింట్లోంచి ఏడుపులు పెడబొబ్బలు వినిపించాయి. వీధిలో కలకలం చెలరేగింది.

హసన్ పుస్తకంమూసి హడావుడిగా తలుపులు తెరిచి వీధిలోకి వెళ్ళాడు. పక్కింటి వారి రెండో అబ్బాయి లతీఫ్ శవం అరుగుమీద పెట్టి

వుంది. లతీఫ్‌తల్లి, అక్క-చెల్లెళ్ళు హృదయ విదారకంగా ఏడుస్తున్నారు అతన్ని పొట్టన పెట్టుకున్న దుర్మార్గుల్ని శాపనార్థాలు పెడుతున్నారు.

దూరంగా సి. ఆర్. పి. జవాన్లు పరిస్థితుల్ని గమనిస్తున్నారు.

హసన్ కడుపులో దేవినట్లయింది. కళ్ళుమూసుకుని నిద్రపోతున్నట్లుగా వుంది లతీఫ్ శవం. నిన్నటివరకూ ఎన్నెన్నో ఆశలతో జీవించిన వాడు ఈరోజు లేడు. పాపం వాడు బహుసాత్వికుడు. ఎవరి జోలికీ వెళ్ళే వాడు కాదు. పదో క్లాసుతో చదువుచాలించి సైకిల్‌షాపులో పని నేర్చుకుంటు న్నాడు.

"ఎప్పటికైనా సొంతంగా సైకిల్‌షాపు పెట్టాలి చాచా" అనేవాడు లతీఫ్.

నిన్నటివరకూ ఆత్మీయుడైన వ్యక్తిని శవరూపంలో చూస్తున్న హసన్ చలించిపోయాడు. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కాళ్ళు వణికాయి. నిల్చునే శక్తిలేక ఇంట్లోకి వెళ్ళిపోయి కూలబడ్డాడు.

ఇటువంటి సమయాల్లో కల్లోలాలకు కారకులైన వ్యక్తులకు ఏమీ జరగదు. నిప్పు ముట్టించి దూరంగావుంటూ తమాషా చూస్తుంటారు. లతీఫ్ వంటి అమాయకులు బలై పోతుంటారు.

"పెళ్ళి ఏర్పాట్లు చెయ్యడానికి సాయపడండి" నెమ్మదిగా అంది మార్జియానా.

హసన్ తేరుకుని దీర్ఘంగా నిట్టూర్చి లేచాడు.

*　　　　*　　　　*

కర్ఫ్యూ నిర్ణీత సమయాల్లో విధిస్తూ, ఎత్తివేస్తూ కొన్నిరోజులు జరిగాయి. క్రమక్రమంగా అల్లర్లు సద్దుమణిగాయి. నివురుగప్పిన నిప్పులా ఏ క్షణమైనా మతకలహాలు చెలరేగవచ్చునని ప్రజలు భయంభయంగానే తిరుగుతున్నారు.

పదిరోజుల తర్వాత కర్ఫ్యూ పూర్తిగా ఎత్తివేశారు.

హసన్ ఆ రోజు మామూలుగా ఫ్యాక్టరీకి వెళ్ళడానికి సిద్ధమవుతున్నాడు.

తలుపు తట్టిన శబ్దం అయింది.

హసన్ తలుపు తీశాడు.

ఎదురుగా కిషన్ నవ్వుతూ కన్పించాడు.

"అరే! కిషన్ ఇన్నాళ్ళూ ఎక్కడున్నావు ఏమైపోయావోనని భయపడి చస్తున్నాననుకో పిల్లలుగూడా 'చాచా' ఎక్కడున్నాడని కలవరిస్తున్నారు. నీ కేదైనా ప్రమాదం జరిగిందేమోనని ఉస్మానియా హాస్పిటల్ చుట్టూ తిరిగాను"

హసన్ గబగబా మాట్లాడేస్తున్నాడు కిషన్ కనిపించిన ఆనందంలో.

కిషన్ తాపీగా లోపలకు వచ్చి సోఫాలో కూర్చుని "కంటోన్మెంట్ లో ఫ్రెండ్స్ దగ్గరున్నా. వాళ్ళు రానివ్వలేదు. ఈ గొడవల్లో పాతబస్తీకి వెళ్ళడం అంటే ఆత్మహత్య చేసుకోవడమేనని హెచ్చరించారు. నీకు కబురు చెయ్యడానికికూడా కుదర్లేదు" అన్నాడు.

"పోనీలే అల్లా దయవల్ల ఎక్కడో ఒకచోట క్షేమంగా వున్నావు. అంతే చాలు" సంతృప్తిగా అన్నాడు హసన్.

కిషన్ నవ్వాడు.

"కిషన్ భాయ్ ! పిల్లలు నిన్ను పూటపూటకి అడుగుతున్నారు" అంది మార్జియానా.

"పిల్లలు కన్పించడం లేదే. ఎక్కడికెళ్ళారు ?"

"స్కూలుకెళ్ళారు"

"అప్పుడే ఎందుకు పంపించావమ్మా ! రెండురోజులు ఆగితే బాగుండేది. రోజులు అసలే బాగాలేదు" అన్నాడు కిషన్.

"ఫరవాలేదు భాయ్. ఇప్పుడంతా సద్దుమణిగిందిగా" అంది ఆమె.

"నాకు టైమైంది డ్యూటీకి వెళ్ళొస్తాను. నువ్వు విశ్రాంతి తీసుకో" అన్నాడు హసన్ బయల్దేరుతూ.

"అలాగే వెళ్ళిరా. జాగ్రత్త" అన్నాడు కిషన్,

హసన్ టిఫిన్ బాక్సు హేండ్‌బ్యాగ్‌లో వేసుకుని వెళ్ళిపోయాడు.

కిషన్ స్వీట్స్‌ప్యాకెట్ మార్జియానాకు అందించి "పిల్లలు వచ్చాక యివ్వమ్మా" అన్నాడు.

తల వూపింది ఆమె.

*　　　　*　　　　*

మార్జియానా కిప్పుడు హిందువులంటే ఒళ్ళు మండిపోతోంది. నైజాం రాజ్యంపోయి ప్రజారాజ్యం వచ్చాక ముస్లింల ప్రాబల్యం తగ్గిపోయింది. రానురాను హిందూ అధికార్లు పోలీసులు ఎక్కువై పోతున్నారు. వాళ్ళవల్ల తమకు చాలా అన్యాయం జరుగుతోందని భావిస్తోంది. ఇరుగుపొరుగు ఆడ వాళ్ళు కలిసి కూర్చున్నప్పుడు ఎక్కువభాగం హిందువుల్ని తిట్టడంతోనే సరిపోయేది.

మతాలమధ్య, కులాలమధ్య విద్వేషాలు మనసులలో మొలకెత్తనే కూడదు. పొరపాటునో, గ్రహపాటునో ఒకసారి మనసుల్లో నాటుకున్నాక రోజురోజుకీ పెరిగిపోయి మహావృక్షాలై పెకలింప సాధ్యంకాదు.

ఆర్నెల్లక్రితం కిషన్ని ఇంటికి తీసుకొచ్చాడు హసన్. అతను తన స్నేహితుడనీ చాలాకాలం మిలటరీలో పనిచేశాడనీ, ఇప్పుడు ఇక్కడే స్థిర పడిపోవాలని వచ్చాడని చెప్పాడు. విశేషం ఏమిటంటే కిషన్ బ్రహ్మచారి. అతనికి నలభై అయిదేళ్ళు దాటిపోతున్నా పెళ్ళిచేసుకునే ఉద్దేశంలేదు.

"పెళ్ళెందుకు చేసుకోలేదు కిషన్ భాయ్?" అని అడిగింది మార్జియానా ఒకరోజున.

"దరిద్రం భరించలేకనే మిలటరీలో చేరిపోయాను. అసలు దరిద్రునికి పెళ్ళెందుకమ్మా ?" అని ఎదురుప్రశ్నవేసి నవ్వాడు.

అప్రతిభురాలై కొన్నిక్షణాలు అలా వుండిపోయింది. దరిద్రానికి భయపడి పెళ్ళి చేసుకోకుండావుండే వ్యక్తులుగూడా వుంటారా ? అని ఆమెకు ఆశ్చర్యంవేసింది.

కిషన్ అప్పట్నుంచి హసన్ ఇంట్లోనే వుంటున్నాడు. ఇల్లు తాతల నాటిది. విశాలంగా ఎక్కువ గదులతోవుంది గనుక అతను వుంటున్నా ఆ దంపతులకు ఇబ్బందిగా లేదు.

హసన్, కిషన్‌ల స్నేహబంధం గాఢంగా బిగిసిపోయింది. ఇంట్లో వ్యక్తిలా కలిసిపోయాడు. ఉదయం కలిసి భోజనం చేసేవారు. మళ్ళీ రాత్రి హసన్ వచ్చేవరకూ వుండిగాని తినేవాడు కాదు కిషన్. సెలవురోజువస్తే అంతాకలిసి సినిమాకో, పార్కుకో, జూకో వెళ్ళేవాళ్ళు సరదాగా. కిషన్ పిల్లలకోసం తరచుగా బహుమతులు తెచ్చి యిస్తుండేవాడు. పిల్లలు అతనితో చనువుగావుంటూ 'చాచా' అని కలవరిస్తుండేవారు.

అదంతా గతం.

మత కలహాల మారణహోమం తర్వాత కిషన్‌లో ఏమార్పు లేక పోయినా, హసన్ మిత్రుడితో ఆత్మీయంగానే సంచరిస్తున్నా మార్జియానా మనసుమాత్రం మారిపోయింది. కిషన్‌మీద అభిమానం తగ్గుముఖం పట్టింది ఆమెకు. కారణం ఏమిటో ఆమెకే సరిగా తెలియదేమో ?

ఒకరోజు రాత్రి అంది మార్జియానా.

"కిషన్ ఇంకా ఎన్నాళ్ళు వుంటాడు మన ఇంట్లో.

"ఏం ?"

"ఏంలేదు. ఆ కాఫిర్ మనింట్లో ఎందుకుంటున్నాడని ఇరుగుపొరుగు వాళ్ళు అడుగుతున్నారు—సమాధానం చెప్పలేక చస్తున్నాను"

హసన్ ఆమెవంక విచిత్రంగా చూశాడు.

తెల్లటిచీర, తెల్లటి జాకెట్, తలలోవిచ్చి పరిమళాలు విరజిమ్ము తున్న తెల్లటి మల్లెపూలతో మార్జియానా శాంతి దేవతలా కనిపిస్తోంది. కాని ఆమె మనసులో ఏదో పిశాచం దూరి కరతాళ నృత్యం చేస్తోంది.

ఆమె ముఖంలోని మార్పు గమనించి దీర్ఘంగా నిట్టూర్చాడు హసన్.

"మీరేమో ఫ్యాక్టరీకి వెళ్ళిపోతారు. అతను ఒంటరిగా ఇంట్లో ....? చూసేవాళ్ళు ఏమనుకుంటారు ?" సీరియస్‌గా అంది మార్జియానా.

హసన్‌కి ఏం చెప్పాలో తోచలేదు. ఆమె మత దురహంకారపు విష ప్రభావానికి గురైందని తెలుస్తూనే వుంది. ఆ మత్తులోవున్న వాళ్ళకి ఎంత చెప్పినా ప్రయోజనంలేదు. చెవిటికి శంఖం వూదినట్లే. పరిస్థితుల ప్రభావం

అది. కొంతలీసే బంగారుపాత్రయినా పొగ తగిలినప్పుడు తన సహజ సౌంద ర్యాన్ని పోగొట్టుకుని మలినమైపోవడం దానితప్పు కాదు. మార్జియానా మనసు స్వతహాగా బంగారంలాంటిదే అయినా మతకలహాల పొగతో మలి నమైపోయింది.

"ఏదైనా నౌకరీ దొరికితే వెళ్ళిపోతాడు" నెమ్మదిగా అన్నాడు హసన్.

"అర్నెల్లయింది. ఇంకా ఎప్పుడు దొరుకుతుంది నౌకరీ ? అసలు దొరుకుతుందా ? ప్రయత్నిస్తేకదా ! తేరగాపడి తినడానికి అలవాటుపడ్డాడు"

ఆమెలో అసహనం అనే సుడిగుండం విలయతాండవం చేస్తోంది.

"మార్జియానా !...."

ఆమెమీద కోపం ముంచుకొచ్చింది. కాని నిగ్రహించుకున్నాడు. తియ్యగా సాగిపోతున్న జీవన సంగీతంలో అపశృతి వినిపించినట్లయి అతని మనసు బాధతో మూలిగింది.

* * *

రాత్రి తొమ్మిదీ దాటుతూవుంది.

ఆకాశం నల్లటి మబ్బులతో నిండి ఉరుములు మెరుపులతో భయంక రంగా కనిపిస్తోంది.

గంటసేపు ఏకధాటిగా కురిసిన వర్షం తగ్గుముఖం పట్టింది. సన్నగా చినుకులు పడుతూనే వున్నాయి. చల్లగాలి రివ్వున వీస్తుంది:

వాన చినుకులు సూదులు గుచ్చుతున్నట్లు శరీరంమీద పడుతున్నాయి.

హసన్ పరిగెత్తాడు.

ఇల్లు దగ్గరైంది.

అతని ఇంటిముందు జనం గుంపుకూడి వున్నారు.

హసన్ గుండె అదిరింది.

'తన ఇంటిముందు జనం ఎందుకున్నారు ? ఏం జరిగింది ? పిల్ల లెవరికైనా ఏదైనా ప్రమాదం జరగలేదుగదా ? అల్లా....నాకు గుండె ధైర్యం ప్రసాదించు'

మనసులో రకరకాల ఆలోచనలు. అనుమానాలు సుళ్ళు తిరుగుతూ వుండగా, గుండె చిక్కబట్టుకుని తడబడుతున్న అడుగులతో గుమ్మం ఎక్కాడు.

హసన్నిచూసి జనం పక్కకి తొలిగి దారి యిచ్చారు.

భర్తను చూడగానే మార్జియానా బావురుమన్నది. వెక్కి వెక్కి ఏడుస్తూ ముఖం చేతులతో కప్పుకుంది.

నివ్వెరపోతూ ఆమెను చూశాడు.

ఆమె జుత్తు చిందరవందరగా చెదిరిపోయివుంది. బ్లౌజు చిరిగి అక్కడక్కడా ఆమె శరీరం తెల్లగా కనిపిస్తోంది. గాజులు పగిలి నేలమీద చెల్లాచెదురుగా పడివున్నాయి.

కిషన్ని పెడరెక్కలు విరిచికట్టి స్తంభానికి కట్టేశారు. అతని తల రేగిపోయివుంది. మూతిమీద నెత్తురుచారలు కనిపిస్తున్నాయి. చొక్కామీద ఎర్రగా నెత్తురు మరకలు వున్నాయి. బాగాకొట్టి కట్టిపడేశారన్నమాట.

కిషన్ నెమ్మదిగా తలపైకెత్తి హసన్‌వంక చూశాడు. అతని కళ్ళు ఎర్రగా వున్నాయి. ముఖం ఉబ్బరించివుంది. ఏదో మాట్లాడాలని ప్రయత్నించగా అతని కంఠం పెగలటంలేదు.

"ఏం జరిగింది ?" ఆవేశం అణుచుకుంటూ ప్రశ్నించాడు హసన్.

మార్జియానా ఏడుస్తూ జరిగినదంతా చెప్పింది.

"చీకటిపడిన తర్వాత చలి చలిగావుంది కొంచెం బ్రాందీ పుచ్చుకుంటాను ఆమ్లెట్టు వెయ్యమని అడిగాడు. ఆమె అలాగేచేసి యిచ్చింది. సీసా ఖాళీచేశాడు. భోజనం చెయ్యమంటే హసన్ వచ్చేవరకూ ఆగుతానన్నాడు. పిల్లలు పడుకున్నాక ఆమె భర్తకోసం ఎదురుచూస్తూ నడుంవాల్చింది. అంతే పులిలావచ్చి మీదపడ్డాడు. మానం దోచుకోబోయాడు. ఆమె భయంతో కేకలు వేసింది. ఇరుగుపొరుగువాళ్ళొచ్చి రక్షించారు. లేకపోతే బతుకు నాశనమైపోయేది.'

ఆమె జరిగిన పీడకలలాంటి సంఘటన నెమరు వేసుకుంటూ వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"నమ్మకద్రోహి. తిన్న ఇంటి వాసాలు లెక్కబెట్టటం అంటే ఇదే"

"ఇన్నాళ్ళూ పెళ్ళిచేసుకోలేదంటే ఎందుకూ ? ఇందుకే మరి. ఇట్లా చాటుమాటు వ్యవహారాలకి అలవాటుపడ్డాడన్నమాట .పాపం మార్జియానా నిప్పులాంటి మనిషి కాబట్టి సరిపోయింది లేకపోతే"

"వీణ్ణి కత్తితో నరికి కాకులకూ గద్దలకూ ఫలహారంగా వెయ్యాలి"

జనం తలోకమాట అంటున్నారు.

కిషన్ తలవంచుకునే వున్నాడు ఎవరి ముఖం చూళ్ళేక.

జరిగినదంతా విన్నాడు హసన్. అతనికి కోపం పొంగివచ్చింది. కళ్ళల్లోకి నెత్తురు దిగినట్లు ఎర్రబడ్డాయి. విసురుగా కిషన్ దగ్గరకు సమీపించాడు. కట్లు విప్పాడు, చేతిలోకి తాడును తీసుకున్నాడు, లావుగా గట్టిగా వున్న కొబ్బరితాడు అది.

అంతా ఊపిరి బిగబట్టి చూస్తున్నారు. హసన్ ఇప్పుడు కిషన్ని ఏం చెయ్యబోతున్నాడు ? అతనికి కోపంరాగా ఎవరూ చూళ్ళేదు. ఆ వీధిలో అతను అజాతశత్రువు, అటువంటి వాడికి కోపంవచ్చింది. రాకేం చేస్తుంది ? స్నేహితుడని ఆదరించి తనతో సమానంగా తిండీ తిప్పలా చూస్తుంటే ఇంతద్రోహం చేస్తాడా ? స్నేహితుడి భార్య శీలం దోచుకోవడానికి ప్రయత్నిస్తాడా ?

భార్యను అవమానించిన కిషన్ని హసన్ క్షమించడు. ఈరోజు కిషన్ చావుతప్పదు.

హసన్ తాడు పైకెత్తి విసురుగా ఒక్క దెబ్బకొట్టాడు.

ఆ దెబ్బ కిషన్‌కి తగలలేదు.

మార్జియానా వీపు పగిలింది. ఆమె చావుకేక పెట్టింది. లేచి నిల్చునే లోపల మరిరెండు అంటించాడు.

"అల్లా....చచ్చాను చచ్చాను" అని గోలపెట్టింది మార్జియానా.

జనం నివ్వెరపోతున్నారు. ఇదేం విచిత్రం ? నేరంచేసినవాడిని వదిలి పెట్టి పెళ్ళాన్ని చితకబాదుతున్నాడేమిటి ? కొంపదీసి వీడికేమైనా మతి చలించిందా ?

ఆవేశంతో వూగిపోతున్న హసన్ని బలవంతంగా పట్టుకుని ఆపారు.

"పాపాత్మురాలా ! నిజం చెప్పు. లేకపోతే ఈరోజు నీ ప్రాణం తీస్తాను. కిషన్ నిజంగా నీవంటిమీద చెయ్యివేశాడా ? చెప్పు, చెప్పవే ?" హసన్ అరిచాడు.

అతని కేకలు సింహగర్జనలా వినిపించి అక్కడ కూడిన వాళ్ళంతా అదిరిపడ్డారు.

మార్జియానా బెదిరిపోయింది హసన్ రౌద్రాకారంచూసి. నెత్తురు పులిమినట్లు ఎర్రబడిపోయిన అతని ముఖంచూసి ఆమె భయంతో వణికి పోయింది. అతని చూపులు కత్తికంటే పదునుగావుండి ఆమెను నిలువునా చీల్చివేస్తున్నాయి.

"నన్ను కొట్టకండి, నిజం చెప్తాను. కిషన్ నన్నేమీ చెయ్యలేదు. అతన్ని ఇంట్లోనుంచి పంపించి వేయడానికి నేనే నాటకం ఆడాను" వెక్కి వెక్కి ఏడుస్తూ చెప్పింది మార్జియానా. ఆమె తలెత్తి ఎవరివంకా చూళ్ళేక అవమానభారంతో కృంగిపోయింది.

ఒక్కసారిగా అంతా కరెంట్‌షాక్ తిన్నట్లు బిగుసుకుపోయారు.

అదివరకు కిషన్ని కొట్టినవాళ్ళు పశ్చాత్తాపంతో "అయ్యో! పాపం" అనుకున్నారు.

అతన్ని తిట్టినవాళ్ళు నోళ్ళు తెరిచారు ఆశ్చర్యంతో.

హసన్‌కి స్నేహితుడు తప్పు చెయ్యడు అని గాఢంగా నమ్మటానికి మూలం ఏమిటి ? భార్య నాటకం ఆడినట్లు ఎలా గ్రహించగలిగాడు. ఎవరికీ అంతుబట్టని విషయం అది.

ఏది ఏమైనా వారి స్నేహం ఛేధించ సాధ్యంకాని కంచుకోటలాంటి దనే సత్యం తెలుసుకున్నారు.

"హసన్ !" అంటూ కిషన్ అతన్ని కౌగలించుకున్నాడు. వేదనతో సలిగిపోతున్న హృదయాన్ని అదుపులో పెట్టుకోలేక వెక్కి వెక్కి ఏడ్చాడు.

హసన్ అతన్ని వూరడించి సోఫాలో కూర్చోబెట్టాడు.

"అల్లా నీకు అందంమాత్రమే ఇచ్చాడుగాని మనిషిక్కావలసిన మానవత్వం ఇవ్వలేదు" అని భార్యవంక అసహ్యంగా చూశాడు హసన్.

తర్వాత అందరినీ ఉద్దేశించి చెప్పాడు.

"మీకు ఆశ్చర్యంగా వుండొచ్చు. మార్జియానా నాటకం ఆడిందని ఎలా కనిపెట్టగలిగానో తెలియక. కిషన్ నాకు వట్టి స్నేహితుడు మాత్రమే అయితే నా భార్య చెప్పింది నమ్మి వుండేవాడిని. అతన్ని చావగొట్టి వుండేవాడిని. అమాయకుడు బలై పోయేవాడు. అసలు రక్తంపంచుకుని పుట్టిన చెల్లెలిపై ఏ అన్నయినా అత్యాచారం చేస్తాడా ? చెప్పండి"

"చస్తే చెయ్యడు"

"కిషన్, మార్జియానా ఒక తల్లి కడుపున పుట్టిన వాళ్ళు. వారిద్దరి రక్తం ఒకటే" అన్నాడు హసన్.

అంతా చకితులయ్యారు.

"ఇది పచ్చినిజం. వాళ్ళ తల్లిదండ్రులు ఒక యాక్సిడెంట్‌లో చనిపోయారు. అప్పుడు కిషన్ వయసు పదిహేనేళ్ళు. మార్జియానా నాలుగేళ్ళ పసిపిల్ల. వీళ్ల దిక్కులేని వాళ్ళయ్యారు. అప్పుడు పక్కింట్లోవున్న తాశీల్దారు ఖాజా షేర్‌ఖాన్ వీరిని ఆదరించాడు. కిషన్ని ఒక గారేజీలో పనికి పెట్టాడు. కాని అతను కొన్నాళ్ళకి పారిపోయి మిలటరీలో చేరిపోయాడు. అతనిచెల్లెల్ని తన కూతురులా పెంచి పెద్దజేశాడు. పెళ్ళికిముందే నాకీవిషయం చెప్పాడు. ఎవరికీ తెలియనివ్వ వద్దని ప్రామిస్ తీసుకున్నాడు. కిషన్ దేశాలు పట్టిపోయాడు. అతనికి చెల్లెలు ఎక్కడుందో తెలీదు. ఇన్నాళ్టికి తిరిగి వచ్చాడు. ఎలాగో మా మామఖాజాగారిని పట్టుకుని నా అడ్రస్ తెలుసుకున్నాడు. చెల్లెల్ని చూడడానికి వచ్చాడు. ముస్లిం స్త్రీగా పెరిగి పెద్దదై, ముస్లిం యువకుడిని పెళ్ళి చేసుకుని వాళ్ళ సంస్కృతికి అలవాటుపడిన ఆమెను సడన్‌గా నువ్వు హిందూ స్త్రీవని చెప్పడం అన్యాయం అనీ,

ఆమెకు మనోక్షోభ కలిగించడం అనవసరమనీ అభిప్రాయపడ్డాడు. అతను చెప్పిందాంట్లో యథార్థంవుంది. అనవసరంగా ఆమెలో సంఘర్షణ రేపి అశాంతికి గురిచెయ్యడం అధర్మమని నేనూ నమ్మాను. అందుకే కిషన్ ఆమె సోదరుడనే విషయం చెప్పలేదు. నా స్నేహితుడుగానే వుంటున్నాడు. ఈ నగ్నసత్యం తెలియక మార్జియానా మతం మత్తులోపడి అసహ్యంగా ప్రవర్తించింది"

ఆ కథంతా విని అంతా సంభ్రమాశ్చర్యాలతో మూగబొమ్మల్లా వుండిపోయారు. ఎవరి నోటివెంటా మాటలురాలేదు.

ఆకాశం పగిలినట్లు ఎక్కడో పిడుగుపడింది, అది తన నెత్తినే పడినట్లు దిమ్మెరపోయింది మార్జియానా. ఆమె కళ్ళముందు చీకట్లు వ్యాపించాయి. శరీరమంతా కంపరం బయల్దేరింది. తానెంత పతనమైపోయిందో తల్చుకుని అవమానభారంతో కృంగిపోయింది. మనసుని, హృదయాన్ని, శరీరాన్ని ఒక్కసారిగా ఆవరించి కాల్చివేస్తున్న వేదన మూలంగా ఆమె కళ్ళు వర్షించాయి. ఆ క్షణంలో ఆమెకు జీవితంపై విరక్తి కలిగింది. భూమి రెండుగా చీలి తను అందులో సమాధి అయిపోతే ఎంత బాగుండును అని తలపోసింది.

మార్జియానా అతికష్టంమీద లేచి వెళ్ళి కిషన్ కాళ్ళకు చుట్టుకుని "నన్ను క్షమించుభాయ్! తెలియక నీకు ద్రోహంతలపెట్టాను. సోదర ప్రేమను అర్థంచేసుకోలేక మతం మత్తులో మానవత్వాన్ని మరిచిపోయాను. నేను పాపాత్మురాలిని" అంటూ ఏడ్చింది.

ఏడుస్తున్న పసిపాపను సముదాయించడానికి తాపత్రయపడే తండ్రిలాగా కిషన్ ఆమెను లేవనెత్తాడు. అతని కళ్ళల్లో భాతృప్రేమ తొణికిసలాడుతోంది.

ఎప్పుడో విధివశాత్తు విడిపోయిన అన్నాచెల్లెళ్ళ అపూర్వకలయిక చూసి అందరికళ్ళు చెమ్మగిల్లాయి. హృదయాలు బరువెక్కాయి.

చీకటి చెదిరిపోయి చిరువెలుగు వారి మనసుల్లో నిండింది.

(ప్రచురణ : స్వాతి మాసపత్రిక, జూన్ - 1985.)

....o....